క్లుప్తంగా

నేడు హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి వడమలో నూతనంగా నిర్మించిన శ్రీవర వీర హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు తూముల లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ



సరోజనమ్మ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కళావతి

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండ గ్రామానికి చెందిన పాలక సరోజినమ్మ ఇటీవల ఉపాధి పనులకు వెళ్లి అక్కడ అస్వస్థతకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం గ్రామానికి చేరుకుని మృతురాలి భర్త పెంటయ్యను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వాహనాల రాకపోకలకు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న గ్రామస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామం నుంచి కెమిశిల గ్రామం వైపు వెళ్లే దారిలో బుధవారం పలు చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం వీచిన భారీగాలులకు చెట్లు కూలిన విషయం తెలుసుకున్న సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూలిన చెట్లు తొలగించారు.

దుర్గాదేవికి విశేష పూజలు



వీరఘట్టం: వీరఘట్టం ప్రజల ఇలవేల్పు కోట దుర్గాదేవికి బుధవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో ఇబ్బందులు



మొబైల్ వాహనంలో పోస్టర్లు ప్రదర్శించి సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: సికిల్‌సెల్ ఎనీమియాతో అనేక ఆరోగ్య సమస్యలు ముడిపడి ఉంటాయని వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని పనుకువలస, దుగ్గి, ఎన్.పారాపురం, వాటపాగు, టీకే.రాజపురం గ్రామాల్లో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సికిల్‌సెల్ ఎనీమియా వల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొబైల్ వాహనం ఇన్‌చార్జ్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అవగాహన పెంచుకోవాలి



ప్రభుత్వరంగ కార్యకలాపాలపై వివరిస్తున్న శివకుమార్, తదితరులు

పాలకొండ రూరల్: ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కార్యాలయాలు, వాటి పనితీరుపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని పాలకొండ శాఖా గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రభుత్వ శాఖలు, వాటి పనితీరుపై సచివాలయ అడ్మిన్ సెక్రటరీ కె.శివకుమార్ బుధవారం వివరించారు. అనంతరం వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వడదెబ్బ, ఆకాల వర్షాల కారణంగా పడుతున్న పిడుగులు వాటి నుంచి రక్షణ పొందే విధానాలపై అవగాహన కల్పించారు.

అందుబాటులో అమృతం..

- వేసవి వేడిని పారద్రోలే ఆహారాలు
- పాత ఆహార అలవాట్లకు మళ్లీ క్రేజ్

భామిని:

మండుతున్న ఎండల వేడిమి నుంచి రక్షణ పొందడానికి అందుబాటులో ఎన్నో పురాతన సాధనాలున్నాయి. అన్నీ అందుబాటులో ఉండి అతి చౌకగా లభించేవి కావడం విశేషం. ఇందులో ముఖ్యమైనది చద్దన్నం. చద్దన్నాన్ని మన పూర్వీకులు అందుబాటులో ఉండే అమృతం అన్నారంటే ఎంత విశేషమైనదో అర్థం చేసుకోవాలి. చద్దన్నం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు కూడా చెబుతున్నారు. ఉదయాన్నే చద్దనం తింటే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు. చద్దన్నంలో పొటాషియం, కాల్షియం, ఐరన్ విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఉల్లిపాయ నంచుకు తింటే శరీరంలోని వేడిని తగ్గించవచ్చు. డీ హైడ్రేషన్, అలసట, బలహీనతను దూరం చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. మలబద్ధకం, నీరసం తగ్గి పోవడంతో పాటు బీపీ అదుపులో ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలు పటిష్టమవుతాయి.



ఎల్లవేళలా ఆరోగ్యాన్ని కాపాడే చద్దన్నం

తాటిముంజలతో చల్లదనం..

తాటి ముంజలు తింటే ఎండ తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది. ముంజుల్లో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. విటమిన్ ఏ, బీ, సీలతో పాటు జింక్, పొటాషియం, పాస్పరస్‌లను శరీరానికి అధికంగా అందిస్తాయి. శరీరంలోని వేడి తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని కొలెస్ట్రాల్‌ను నియంత్రించి బరువును తగ్గిస్తుంది. అలాగే మలబద్ధకం, విరేచనాల సమస్యలకు నివారణిగా పనిచేస్తుంది. డీ హైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. చర్మ వ్యాధులు, దద్దుర్లు, కాలేయ సమస్యలు, ఎసిడిటీలకు తాటిముంజులతో చెక్ పెట్టవచ్చు.



చల్లదనం పెంచే తాటి ముంజలు

కీరదోసతో ఎన్నో ప్రయోజనాలు..


కీరదోసలో 96 శాతం నీరు ఉండడం వల్ల డీ హైడ్రేషన్ సమస్య తలెత్తదు. అంతర్గత వాపు, కండరాల నొప్పిని తగ్గిస్తుంది. పొటాషియం వల్ల రక్తపోటు తగ్గుతుంది. చర్మం మడతలు పడకుండా యవ్వనంగా ఉంచుతుంది. నోటి దుర్వాసన తగ్గడంతో పాటు శరీరంలోని అధిక వేడిని తగ్గిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కీరదోస మంచి ఆయుధం. కీరలోని డైయూరిటిక్ గుణాల వల్ల మూత్రం ద్వారా టాక్సిన్స్ బయటకు పోతాయి.



చల్లదనం పెంచే తాటి ముంజలు

మజ్జిగ మరీ మంచిది..

వేసవిలో చల్లదనం కోసం ఎక్కువగా పండ్ల రసాలు తీసుకుంటాం. అయితే జ్యూస్‌ల కన్నా మజ్జిగ తాగితే ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు చెబుతున్నారు. మజ్జిగలో జీలకర్ర పొడి, కొత్తిమీర, పుదీనా వంటివి కలిపితే మరింత ప్రయోజనం చేకూరుతుంది. చల్లదనంతో పాటు జీర్ణక్రియ వేగవంతం అవుతుంది.



డీ హైడ్రేషన్ కాకుండా కాపాడే చల్లని మజ్జిగ

> **నీరు ఎక్కువగా ఉండే ఆహారం మేలు..**
>
> వేసవిలో ఉక్కబోత, డీ హైడ్రేషన్ వంటి సమస్యలకు బార్లీ నీళ్లు కూడా సహకరిస్తాయి. నీటిశాతం ఎక్కువగ ఉన్న ఆహర పదార్థాలు తీసుకోవడం మంచిది. పూర్వీకులు చెప్పిన విధంగా చద్దన్నంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. పండ్లు, ఆకుకూరలు ప్రతిరోజూ డైట్‌లో ఉండేలా చూసుకోవాలి. రెండు పూటలా స్నానం చేయడం వల్ల చెమట వల్ల వచ్చే ఫంగస్ సమస్యలను దూరం చేయవచ్చు.
>
> –డాక్టర్ కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, పాలకొండ

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

వీరఘట్టం: ఉపాధి పనులు ముగించుకుని ఆటోలో తన గ్రామానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గడగమ్మ గ్రామానికి చెందిన అరసాడ ప్రసాదరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ప్రసాదరావు మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడిందన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే గాయపడిన వారికి రూ. లక్ష చొప్పున మంజూరు చేయాలని కోరారు. పరామర్శించిన వారిలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కొల్లి గంగునాయుడు, రెడ్డి ఈశ్వరరావు, నారాయణపురం సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



మృతునికి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు

జియ్యమ్మవలస: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ధర్మారావు ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఉన్న 31 పంచాయతీల్లో జూన్ 21వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యం వివరించడంతో పాటు యోగాసనాలు వేయిస్తూ వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. గ్రామంలో కార్యక్రమ నిర్వహణకు యోగా విద్య తెలిసిన వారు ప్రజలకు యోగా నేర్పేందుకు ముందుకు రావాలని కోరారు. పేరు, గ్రామం, ఫోన్ నంబర్ తెలియజేయాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

భామిని: పీఎం జన్‌మాన్ ద్వారా మంజూరైన గృహాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని తాటిమానుగూడలో జరుగుతున్న గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తే బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తామన్నారు. అనంతరం వనతల్లి వీడీవీకేను సందర్శించి కార్యక్రమాలపై ఆరా తీశారు. వీడీవీకేకు తగిన ఆర్థిక సహాయం చేయకపోవడంపై వెలుగు ఏపీఎం చక్రపాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నదిమిలిలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులపై సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్, ఈఓలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర నాయుడు, వీఆర్ఓ వినోద్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



చిన్నదిమిలిలో జల్‌జీవన్ మిషన్‌పై సూచనలు ఇస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్

రీ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: వీఆర్వోలు గ్రామాల్లో అమలవుతున్న రీసర్వే, రైస్‌కార్డుల పరిశీలన, అన్నదాత సుఖీభవ, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంతో వివిధ అంశాలపై బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయడానికి సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే వివరాలు, రైతులకు సంబంధించిన భూముల నక్షలను సరిచూసుకుని అసలైన రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఇళ్లస్థలాలు లేని పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ పథకాలు సమకూర్చాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని చెప్పారు.

భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి..

పాలకొండ రూరల్: ఉపాధి వేతనదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని క్షేత్ర సహాయకులు వ్యవహరించాలని ఎంపీడీఓ ఎం.విజయరంగారావు అన్నారు. మండలంలోని అన్నవరం సాగునీటి కాలువలలో వేతనదారులు చేపడుతున్న పనుల తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు జరుగుతున్న చోట కచ్చితంగా ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమయం వృథా చేయకుండా పనులు చేపట్టాలని వేతనదారులకు సూచించారు.



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయరంగారావు

గోశాలలకు అందని బిల్లులు

- ఆర్థిక ఇబ్బందుల్లో లబ్ధిదారులు

సీతానగరం:

మండలంలోని పలు గ్రామాల్లో పాలకుల సిఫార్స్ మేరకు పాడి పశువులున్న వారు 9 నెలల క్రితం గోశాలల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా ఇంత వరకూ బిల్లులు చెల్లించక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో ఉపాధిహామీ పథకం నిధులతో పాడి పశువులున్న వారు గోశాలలు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసు కోవాలని అధికారులు చేసిన సూచనల మేరకు మొదటి విడతగా 24 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అందులో వివిధ గ్రామాల్లో 21 మంది గోశాలల నిర్మాణాలు జరిగాయి. లబ్ధిదారుల్లో కొంతమందికి ఒక్కో గోశాల నిర్మాణానికి 4 ఆవులున్న షెడ్‌కు రూ.1.80 లక్షలు, 6 ఆవులున్నగో శాలకు రూ.2.30 లక్షలు వంతున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొదటి విడతలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఒక్కో షెడ్‌కు రూ.40 వేల వరకూ బిల్లుల చెల్లింపు జరిగింది. కొంతమందికి బిల్లుల చెల్లింపులు జరిగిన కారణంగా కార్యకర్తల ఒత్తిడి మేరకు రెండ విడత 230మంది దరఖాస్తు చేసు కోగా 81 గోశాలల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. 7 నెలల క్రితమే నిర్మాణం ప్రారంభించిన 81 గోశాలల నిర్వాహకులు పనులు పూర్తి చేసుకున్నా ఇంతవరకూ బిల్లులు చెల్లించక పోవడంతో అవస్థలు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గోశాలల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బూర్జలో నిర్మించిన గోశాల



అంటిపేటలో నిర్మాణం పూర్తయిన గోశాల

> **బిల్లుల చెల్లింపునకు చర్యలు..**
>
> మండలంలో పాడి పశువులున్న వారికి ఉపాధి హామీ పథకం నిధులతో గోశాలలు మంజూరు చేయగా లబ్ధిదారులు పనులు పూర్తి చేయడం వల్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు, బ్యాంక్ అకౌంట్స్‌తో కలిపి ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో లబ్ధిదారుల ఖాతాలకు బిల్లులు జమ కావాల్సి ఉంది.

సాగు నీరు అందించండి

- ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువకు మరమ్మతులు చేపట్టి రైతులకు ఈ ఏడాది సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు అన్నారు. ఈ నెల 28న చేపట్టనున్న ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని బాసూరులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడమ కాలువ పరిధిలోని సుమారు 25 గ్రామాల రైతులకు ప్రతి ఏటా సాగునీరు అందడం లేదని తెలిపారు. ఈ విషయమై ఈనెల ఆరో తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఇంతవరకు కాలువల మరమ్మతుల కోసం ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల 28న కోటదుర్గమ్మ ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. రాజకీయాలకతీతంగా రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కిమిడి బంగారునాయుడు, వంజరాపు అప్పలనాయుడు, మజ్జి గణ, పొట్నూరు శ్రీను, గిరిజాల రమణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వెళ్లే రహదారి వద్ద కొత్తగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణం, భక్తులకు అన్నప్రసాదం వితరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్త బిడ్డిక గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వల ఆజారి తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి..

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అప్పలాచార్యులు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. కొత్తగా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహం వద్ద స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, సిందూర పూజలు, సాయంత్రం హనుమాన్ చాలీసా పఠనం, దండకం, పంచముఖ స్తోత్రం వంటివి చేపట్టనున్నామన్నారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

అవగాహన చక్కటి మార్గం..

పాలకొండ రూరల్: మలేరియా, టైఫాయిడ్, డెంగీ, తదితర జ్వరాల నుంచి రక్షణ పొందేందుకు అవగాహన చక్కటి మార్గమని మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి మోహనరావు అన్నారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ మహమ్మారులను అధిగమించవచ్చన్నారు. ఎం.సింగుపురం పీహెచ్‌సీ పరిధిలోని బడ్డుమసింగి గిరిజన గ్రామంలో బుధవారం మలాథియన్ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నివారణ, ప్రస్తుత సీజన్‌లో పల్లెల్లో నమోదవుతున్న ఆరోగ్య సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సంపరకోట సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ హెల్త్ వర్కర్స్ ఎ.పెంటయ్య, ఎస్.నోషన్, టి.రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మలాథియాన్ పిచికారీ చేయిస్తున్న అధికారులు

ఈఎన్‌టీ ఎండోస్కోపీ సేవలు..



సీతంపేటలోని ఏరియా ఆస్పత్రిలో ఈఎన్‌టీ ఎండోస్కోపీ సేవలను బుధవారం ప్రారంభించారు. చెవి, ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యుడు బి.శివకుమార్, వైద్యాధికారి మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం...



అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఐటీఐలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిడుగులు పడే సమయంలో చెవులు మూసుకుని పడుకోవడం, కూర్చోవడం వంటివి చేయాలన్నారు. చెట్లు కింద ఉండరాదని సూచించారు. వివిధ రకాల అగ్ని ప్రమాదాలను నిర్మూలించే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

లీకేజీ లేకుండా మరమ్మతులు చేయండి

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మార్ నగరం గ్రామంలో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న గ్రామానికి సరఫరా అందించే పైప్‌లైన్ వద్ద లీకేజీ కారణంగా మంచినీరు వృథాగా పోవడంతో సంబంధిత సిబ్బంది దృష్టి సారించి లీకేజీ లేకుండా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.